పట్నం బస్సు

యండమూరి వీరేంద్రనాథ్



ఎండ పెళపెళ లాడుతోంది. అరవడానికి కూడా భయపడుతున్నట్టూ కాకులు విశ్రాంతి తీసుకొంటున్నాయి. రోడ్డంతా నిర్మానుష్యంగా వుంది. దూరంగా కల్లుకొట్టు దగ్గర మాత్రం ఎవరో ఏదో కొనుక్కొంటున్నారు...

పటుత్వం తగ్గిపోయిన శరీరం వైపు వణుకుతున్న చేతి వేళ్ళకేసి ఒకసారి చూసుకొన్నాడు మోచోడు. చేతిలో కత్తి పక్కన పెట్టేడు. ఎదురుగా గుట్టలా వున్న తోళ్ళని పక్కకి జరిపేడు వేళ్ళు విరుచుకొని, గట్టిగా నిట్టూరుస్తూ రోడ్డుకేసి చూసేడు.

రావిచెట్టు క్రింద నీడ దట్టంగా పరుచుకొని వుంది. దక్షిణం నుంచి గాలి అలలు అలలుగా వీస్తోంది.

పడమటి వైపు జారిపోతున్న వయసు గురించి చింత మోచోడికి కలగటం లేదు. ఏదో సాధించిన తృప్తి హృదయం నిండా పరుచుకొని వుంది. బొడ్లోంచి చుట్ట తీసి వెలిగించుకొన్నాడు. మళ్ళీ రోడ్డువైపు దృష్టి సారించేడు బస్సు వస్తున్న జాడ ఎక్కడా కనబడలేదు. దూరం నుంచి నడుచుకొంటూ యాదగిరి వచ్చేడు.

పక్కనే కూర్చొని చుట్ట అడిగి తీసుకొంటూ 'ఏంద్వయ్యా— మంచి హుషారుగున్నవ్?' అడిగేడు.

'ఏమ్లే' అన్నాడేగానీ మోచోడి దృష్టి అంతా రోడ్డుమీదే వుంది. రోడ్డు తిన్నగా సాగి, దూరంగా ఎక్కడో మలుపులో అదృశ్యమైపోతోంది.

'మరి గట్ల చూస్తాంటివే?'

మోచోడు మాట్లాడలేదు మళ్ళీ యాదగిరే అడిగేడు. 'పెద్దోడు వస్తాన్నాడు గీ పర్యాసులా?'

తలూపేడు. 'పొద్దున్నే పోయు. వచ్చేదుంది.'

'దేనికి పోయిండు పట్నం?'

'ఇయ్యాల నౌఖరీలోకి తీస్కునేకి గదేందో వున్నదంట.'

'ఏమ్టిది?'

మోచోడు క్షణం ఆలోచించి 'ఇంటరూ' అన్నాడు.

'ఇంటరూ?'

'గదేరా - ఇంటరూనో... ఇంటవ్యూనో—''

అంతలో దూరంగా దుమ్ము కనబడింది. మోచోడి మొహం విప్పారింది. చుట్ట గట్టిగా పీల్చేడు. బస్సు గర్భిణీ స్త్రీలా నెమ్మదిగా వస్తోంది.

'గైతె పట్నంలా నౌఖరీ జేయిస్తవు?'

'మల్ల గింత చదువు చదివించింది నౌఖరీ జెయ్యనీకి గాక గిట్ల చెప్పులు కుట్టటానికను కొన్నావు?'

'నీకేమయ్యా? గీ సుట్టు పక్కల వాయిగు పల్లెలకి నీవొక్కన్వేగాదు మోచోన్వి!. మాసానికి మూడునాల్గు నూర్లు సంపాయిస్తున్నావాయె'

వాడి మాటలకు అడ్డుతగులుతూ 'నే జేసే పని చేసేదుంటే వాన్ని గింత సదివించేది దేనికిరా — మూడో క్లాసులో మాన్పించి వుండేది కాదు?' అన్నాడు.

'ఏంతోస్తదంటు తనాకు?'

'అయిదారు నూర్లు రాదంటావు ?' తిరిగి వాణ్ణే అడిగేడు.

'అయిదారు నూర్లు ?'

'మల్లా ? మల్లా అదు సదివింది ఏమను కొన్నవ్‌రా ?...బియ్యే ... సమరు ఐనాది ?' చాలామందికి తరచు చెప్పటంవల్ల - 'బియ్యే' అనే పదాన్ని స్పష్టంగా పలికేడు.

బస్సు వచ్చి ఆగింది క్షణం ఆగి కదిలింది.

పెద్దోడొక్కడే దిగేడు.

తెల్ల షర్టు నల్ల ఫాంటులోకి ఇన్‌షర్ట్ చేసేడు. కాళ్ళకి నల్లటి బూట్లు నిగనిగ లాడుతున్నయ్. చేతిలో సర్టిఫికెట్ల బ్రీఫ్ కేసుంది. ఎర్రటి టై గాలికి అందంగా వూగుతోంది,

దూరం నుంచి తండ్రినీ యాదగిరినీ చూసి పలకరింపుగా నవ్వేడు.

మోచోడు యాదగిరివైపు చూసేడు.

వాడు తనవైపు చూస్తూ వుండటం చూసి, తన ఆతృత వాడు గుర్తించకుండా వుండేటందుకు, తను చాలా మామూలుగా వున్నట్టు మొహం పెట్టి "నాకదే సమఝయిత లేదురా" అన్నాడు.

'ఏంచ్చయ్యా?'

'ఈ బస్సు పట్నంకు పోయేప్పుడు గింత మందిని తీసకుపోతంది కదా! మల్లగా పట్నం కెళ్ళి పల్లెకు తిరిగొచ్చేప్పుడు ఖాళీగా వస్తదేందిరా?'

యాదగిరినవ్వి ఏదోచెప్పబోయేడు. ఇంతలో పెద్దోడు వాళ్ళ దగ్గరకొచ్చేడు.

'ఏమైనాదిరా?' మోచోడి కఠంలో ఆతృత ధ్వనించింది. పెద్దోడి మొహం వెయ్యి క్యాండిల్ బల్బులా వెలిగిపోతోంది. వచ్చి వాళ్ళ పక్కనే కూర్చోబోయి ఫాంటు నలుగు తుందని భయపడి, నిలబడే అన్నాడు.

'ఉద్యోగ మొచ్చినాదే నాయినా'

మోచోడు ఆనందంతో తబ్బిబ్బు అయి, 'వచ్చినాధి?' అన్నాడు.

'అయితే సెక్కర దినిపియ్యాలె' అన్నాడు యాదగిరి, తండ్రి కొడుకుల వైపుచూస్తూ.

'తినిపిస్త లేదియ్'అని మోచోడు కొడుకు వైపు తిరిగి, 'నువ్‌బో యింటికి. అమ్మకు జెప్పు నేనొస్త గిప్పుడే' అన్నాడు. పెద్దోడు వెళ్ళి పోయేడు.

'గదేంద్యయ్యా— అదు పరీక్ష పూర్తిజేసి రెండేండ్లాయె. ఇప్పుడు దొరికింది. ఎంతుషారు గుండాలె'

మోచోడు తృప్తిగా నవ్వి 'దినిపిస లే— ఇగలే' అన్నాడు. ఎండిన తోళ్ళని చెక్క పెట్టెలోకి తోసేడు. మూకుడులో నీళ్ళు పారబోసేడు. కత్తి దారం లోపల పడేసేడు. బద్దకం గావళ్ళు విరుచుకొని లేచి, ఇంటివైపు వడివడిగా అడుగులు వేసుకొంటూ వడిచేడు.

* * *

'తన్కా రెండు నూర్లా' నిర్ఘాంత పోయేడు మోచోడు. వాడి బలహీన మైన శరీరం ఈ వార్త విని తట్టుకోలేక ఎండు టాకు లా వణికింది.

తలూపేడు పెద్దోడు.

మోచోడికి నోటి వెంట మాట రాలేదు. బ్రీఫ్ కేసు సర్దు కొంటున్న కొడుకుని విస్తుబోయి చూస్తూ వుండి పోయేడు.

అంతలో వాడి తల్లి అక్కడికి వచ్చింది. 'ఇయ్యాలే పోవాల్నందిరా? రెండ్రోజులాగి జేర్రాదు?'

'లే—పోవాలె' అన్నాడు పెద్దోడు. ఈ వుద్యోగం కోసం తనెంత కాంపిటీషన్ ఎదుర్కొవలసి వచ్చిందో, రెండు సంవత్సరాల పాటు ఈ మాత్రం వుద్యోగం కోసం తనెంతగా ఎదురుచూసేడో... తల్చుకొంటేనే భయంగా వుంది. అటువంటిది— వెంటనే జేరమని వాళ్ళు అన్నప్పుడు జేరకపోతే ...ఆ కారణంగా వాళ్ళు ఆ వుద్యోగం ఇంకొకరికి ఇచ్చేమనేస్తే—

ఆపైన వూహించలేకపోయేడు. టైమ్ చూసుకొన్నాడు. నాలుగున్నర...ఇంకో అర గంటలో బస్సు.

గబగబా రెండు జతలు పెట్టుకొన్నాడు. ఇంటర్వ్యూకి కట్టుకెళ్ళిన టై ఓ మూల అరలో పెట్టేడు. పెట్లోంచి ఇంకో టై తీసి లోపల పెట్టేడు.

'అయ్యేందుకు రా?' అందివాడితల్లి.

'ఇవి ప్రతిరోజూ కట్టుకోవాలె. లేకుండ బోతె ఊర్కోరు.'

తల్లి మనసు ఆనందంతో వుప్పొంగింది. సూటూ బూటులో కొడుకుని వూహించు కొంది.

పెద్దోడు వంగి బూటులేసులు బిగించు కొంటున్నాడు.

అప్పుడు చూసేడు మోచోడు. అవి తను కుట్టిన బూట్లుకావు. వాడి మనసు చివుక్కు మంది. తన కందంగా బూట్లు కుట్టేది రాదు - అవున్నిజవే — ఆ కంపెనీవోడు కుట్టి నట్లు తనెట్లు కుట్టగల్గుతాడు ?

పెద్దోడు బ్రీఫ్ కేస్ మూసేసేడు.

మోచోడు అతికష్టంమీద నోరు పెగల్చు కొని తన మనసులో భావం బైట పెట్టేడు.

'రెండు నూర్ల తన్కాకి గంత దూరం పోయేదెందుకురా ? ఈడ్నే వుండ్రాదు. గా రెండొందలు ఈడ్నే వస్తయ్ గదా !'

పెద్దోడు అర్థం కానట్టు చూసేడు.

'ఎట్లొస్తయ్ ?'

'నా పన్జేస్తేరావా ? నే సంపాదిస్తున్నాను గాదు,'

షాక్ తగిలినట్టు నిశ్చేష్టుడయ్యేడు పెద్దోడు. వాడి మొహంలో బాధ, అసహ్యం, రోషం ఒక్కసారిగా నాట్యం చేసినయ్.





సత్వర నివారణకు శక్తివంతమైన మరియు విశ్వసనీయమైన అనాసిన్ తీసుకోనండి.

బలీయమైనది! అనాసిన్ నొప్పిని త్వరితంగా తగ్గిస్తుంది ఎందువల నంటే ప్రపంచమంతటా డాక్టర్లు సిఫారసు చేసే బాధా నివారణ పదార్థాలను అది ఎక్కువగా కలిగియున్నది.

విశ్వసనీయమైనది! అనాసిన్ డాక్టరు ఇచ్చే విశ్వసనీయమైన ప్రిస్క్రిప్షన్ లాగా ఒక మందుల మిశ్రమం. అందువల్లనే లక్షలాది ప్రజలు అనాసిన్‌ను తీసుకొంటారు మరియు సిఫారసు చేస్తారు.

జలుబులు మరియు ఫ్లూ, తలనొప్పి, నడుము నొప్పి, కండరాల నొప్పి మరియు పంటి నొప్పికి బాగా పనిచేస్తుంది.

భారతదేశపు ఎక్కువ జనప్రియమైన నొప్పి నివారిణి.

Rego. User of TM: Geoffrey Manners & Co., Ltd. A2-8/76

పట్నం బస్సు

'నీ పని జెయ్యమంటావు ?'

'ఏమ్రమ ? రెండు నూరలకన్న ఎక్కువ దొరకదంటావు '

తండ్రి అజ్ఞానానికి నవ్వాలో ఏడవాలో అర్థంకాలేదు పెద్దోనికి. సుకుమారంగా వున్న తన చేతులవైపు చూసుకొన్నాడు. తను బి ఏలో చదివిన ఎకనిమిక్స్ పాఠం జ్ఞాపకం వచ్చింది: చిన్న గొడుగు క్రిందో రావిచెట్టు నీడలోనో కూర్చొని చెప్పులు కుడుతున్న దృశ్యాన్ని వూహించుకొన్నాడు. తన పేరు వెనుక బి య్యే డిగ్రీ వ్రాసి, రావిచెట్టుకి మేకు వేసి కొట్టినట్టు కనిపించింది. నవ్వొచ్చింది తండ్రివైపు జాలిగా చూసేడు. ఏదో మాట్లాడబోయేడు అంతలో అతను మాట్లాడ దల్చుకొన్నది వాడి తల్లే మాట్లాడింది.

'ఆడు నీ పన్జెయ్యాలె...దిమాఖ్ ఖరాబ్ అయింది? గింత సదువు సదివింది నీ పన్జేసేటందుకున్నావు?'

మోచోడు మాట్లాడలేదు మళ్ళీ అందుకొంది.

'దొర లెక్క బట్ట లేసుకొని పన్జెయనీకి పోతాంటే, నీ తీర్న ఎండలో గూసొని పన్జెయ్య మంటావు?'

తల్లి మాటల్తో పూర్తిగా ఏకీభవిస్తున్నట్టు పెద్దోడు మోనంగా వుండిపోయేడు. వాడి మనసులో తను పని చెయ్యబోయే ఎయిర్ కండిషన్డ్ రూము, మెత్తటి సోఫాలూ, వాల్ టు వాల్ కార్పెట్ మెదుల్తున్నాయి. నీట్‌గా కట్టుకున్న టై గాలికి ఎగుర్తూ వుంటే, అందమైన లైట్ల కాంతి డ్రై క్లీన్ చేసిన బట్టలమీద నుంచి విక్షేపణం చెందుతూ వుంటే...చుట్టూ అందమైన అమ్మాయిలూ . కిలకిల నవ్వులూ...

'సర్కేసేల కాలేద?' అన్న తల్లి మాటల్తో ఈ లోకంలోకి వచ్చేడు. క్రాపు సర్దుకొన్నాడు. బ్రీఫ్ కేసు చేతిలోకి తీసుకొని 'పోయొస్తా' నన్నాడు.

'మల్లాదివారం తప్పక రావాలె.'

'గట్లనె' వెళ్ళిపోయేడు.

మౌనంగా నిల్చొన్న మోచోడిని భార్య కుదిపింది. 'గట్ల నిలబడతవి సర్కేసుదాకన్న అన్తె పోరాదు? నువ్వట్ల పరేషన్‌గ నిలవడ్తె, ఆని మనసు బాగుంటది?'

మోచోడు కదిలేడు. కొడుకుతో కలిసి నడవటం ప్రారంభించేడు. చాలాసేపటివరకూ తండ్రి ఏమైనా మాట్లాడతాడేమోనని చూసేడు పెద్దోడు. తండ్రి బాధ, అతనికి అర్థరహితంగానూ, అనవసరమైనది గానూ కనబడింది. తను వెళ్ళిపోతున్నాడనే విషయాన్ని జీర్ణం చేసుకోవటం కోసం, తండ్రి అంత మౌనంగా బాధ అనుభవిస్తూ వుంటే కొడుకు హృదయం పూరుకోలేక పోయింది. తండ్రి మనసులో బాధని తనకున్న ఎకిని మిక్కు పరిజ్ఞానంతో పోగొడ్దామని చూసేడు.

'మూడునాయినా, నేను గింత చదువు చదివిందీ, నువ్వు నాచదువు కోసం ఇంత ఖర్చు పెట్టింది గిట్ల నీ పన్జేసేటందుకు కాదు కదా! నేనూ గిట్ల నీపనేజేస్తే, నాతర్వాత నాకొడుక్కూడా చెప్పులు కుట్టేవాడే అయితడు. ఇంకెంతా, ఇక్కడే, ఇట్లనే సెప్పులు కుట్టుకుంట వుండిపోవాలె. కాదంటావ్'

మోచోడు మాట్లాడలేదు. మళ్ళీ పెద్దోడే అన్నాడు.

'నువ్వన్నదీ నిజమే చెప్పులు కుడ్తూ రెండొందల కన్నా ఎక్కువే సంపాదిస్తున్నవ్. కానీ అక్కడ నాపని వేరు...డిగ్నిటీ ఆఫ్ లేబర్ అంటే—' ఆగి పోయాడు. తనువాడిన పదానికి సరి అయిన అర్థం ఏమిటో తండ్రికి ఎలా వివరించి చెప్పాలో తెలియక క్షణం సేపు తడువుకొన్నాడు...'అంటే...అదే సివిలైజేషను...అంటే...నాగరికత'

మోచోడు రావిచెట్టుకేసీ, పెద్దోడు బస్‌స్టాప్‌కేసీ విడిపోయేరు.

* * *

సూర్యుడు పడమటి కొండల్లోకి జారి పోతున్నాడు. రావిచెట్టు నీడ దట్టంగా పరుచుకొంటూంది. గూటికి చేరుకొంటున్న పక్షుల కలకలం అప్పుడే మొదలవుతోంది.

మోచోడు పెట్లోంచి సూదీ దారం తీసేడు. తోలు నీళ్ళలో తడిపి, కుట్టటం ప్రారంభించేడు.

దూరంగా ఎక్కడో తీతువు పిట్ట ఆగి ఆగి అరుస్తోంది. మువ్వలు గలగల లాడుతుంటే ఎడ్ల జత ఒకటి పొలం నుంచి పరుగెత్తుకొంటూ వస్తోంది. గొడ్లు కాసుకొనే కుర్రవాడొకడు గొంతెత్తి ఏదో పాడుకొంటూ ఇంటికి సాగి పోతున్నాడు.

మోచోని పక్కనే వచ్చి కూర్చున్నాడు యాదగిరి.

'నీ ఇంటికెళ్ళే వస్తాన్నా!'

'... ... ...'

'పెద్దోడు ఇయ్యాళ్ళే పోతున్నాడంట గాదు?'

ఔనన్నట్టు తలూపేడు.

ఒక నిముషం నిశ్శబ్దం. యాదగిరి బస్‌స్టాప్ వైపు పరీక్షగా చూసి, 'ఆడు పెద్దోడు గాదు?' అన్నాడు. '...పట్నం బస్సింకా రాలె?'

'రాలె.'

యాదగిరి అటే చూస్తూ 'ఆడ్ని పట్నం బోవద్దన్నావంట' అన్నాడు

మోచోడు మాట్లాడలేదు.

'ఆడొచ్చేదాక వుద్యోగ మొస దా రాదా అన్నావ్‌స్తివి. వచ్చినాక పోవద్దన్నావ్?'

'... ... ...'

'గట్ల మాట్లాడకుండ గూసుంటివి?'

'ఏం మాట్లాడాలె?'

'ఆడ్ని నువ్ చేసే పనే జెయ్యమన్నావంట గాదు?'

'ఔ! చేయమన్న.'

'దిమాఖ్ ఖరాబైనాది?'

భార్య అన్న మాటే వాడూ అనేసరికి మోచోడిలో అణగివున్న ఆవేశం చెలియలికట్ట దాటింది. తుపుక్కున వూసేడు. చేతిలో దారం వదిలేసి యాదగిరి వైపు తిరిగేడు.

'నా దిమాఖ్ ఖరాబైందంటావ్?...నియవ్వ...నా దిమాఖ్ ఖరాబ్ కాలేదు. —గదో... గాడ నిల్చున్నడు సూడు..ఆడు..అనికిరా ఖరాబైంది. ఇయ్యాల రెండునూర్లు దొరుకుతున్నయని బట్నం బోతన్నడు...'

'మల్ల నీ లెక్క మూడు నూర్లు సంపాదించేటందుక్క ఎండలో గూసొని పన్జెయ్యాలె?'

'లే– గట్ల మంచి బట్టలేసుకొని రెండు నూర్లే సంపాదించమన– నేనేమొద్దన్నే... నా తీర్పు మోచోన్ల అవ్వమని నేనెందుకంట? కానీ ఆడు గట్ల మంచి బట్టలేసుకొని, మెడకు అది కట్టుకొని పట్నంలా జేసే పనేందో నీకు దెల్సార?... కొనుక్కోనేటందుక్కు వచ్చినోల్ల కాళ్ళకి రకరకాల సెప్పులు తొడిగే ఉద్యోగం!'

యాదగిరి కట్రాటే అయ్యేడు.

మోచోడి ఆవేశం ఆవేదనలోకి దిగింది.

'నువ్వే సెప్పులు స్వయంగ తయారైసి నాతీర్న అమ్మరా అంటే ఆనికి సదువు అడ్డొచ్చినాదంట... దానికన్న ఆ సెప్పుల కంపెనీవో డిచ్చింది. మంచి ఉద్యోగమంట.. థూ...' వూసేడు. వాడి కంఠం రుద్ధమైంది. దాదాపు ఏడుస్తూ ...'గా సెప్పుల కంపెనీవోడు నా కొడుకుని లాగేసుకొన్నడు. ఇంగ కొంతకాలంబోతే నన్ను లాగేసుకుంటడు' అన్నాడు కంఠంలో నిస్సహాయత ధ్వనిస్తోంది.

పట్నం వెళ్ళే బస్సు వచ్చి ఆగింది. ఒకరో ఇద్దరో దిగేరు. ఎక్కటానికి మాత్రం జనం కుమ్ములాడు కొంటున్నారు.

'సివిలైషనంట . సివిలైషను' గొణుక్కున్నాడు మోచోడు.